క్లుప్తంగా

హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలి



బస్టాండ్ వద్ద ధర్నా చేస్తున్న రవాణా రంగం యూనియన్ల నాయకులు, కార్మికులు

కర్నూలు సిటీ: భారత న్యాయ సంహిత క్రిమినల్ చట్టాలను, డ్రైవర్లను జైలు పాలుజేసే ప్రమాదకర హిట్ అండ్ రన్ 106-(1)(2) చట్టాన్ని రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రాధాకృష్ణ, ఎం.డి అంజిబాబు డిమాండ్ చేశారు. బుధవారం ఏపీఆర్టీసీ సమీపంలో ఆల్ ఇండియా రోడ్డు ట్రాన్స్‌పోర్ట్ వర్కర్స్ ఫెడరేషన్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించి మాట్లాడారు. చాలా మంది ఉన్నత చదువులు చదివి ఉద్యోగ, ఉపాధి అవకాశాలు లేక కుటుంబ పోషణ కోసం ఆటో డ్రైవర్లుగా , లారీ, కారు, తదితర వాహన డ్రైవర్లుగా పని చేస్తున్నారన్నారు. వారికి ఎలాంటి సంక్షేమ పథకాలను అమలు చేయని ప్రభుత్వాలు, కఠిన చట్టాలతో భయపెట్టడం సరికాదన్నారు. ధర్నాలో మోటర్ వర్కర్స్ యూనియన్ నాయకులు గంగాధర్, రియాజ్, ఆటో కార్మిక సంఘం నాయకులు శ్రీరాములు, ప్రైవేటు బస్సు డ్రైవర్ల యూనియన్ నాయకులు సిద్ధయ్య, ట్రాలీ ఆటో వర్కర్స్ యూనియన్ రమణ, సీఐటీయూ నాయకులు మధు, చిన్న,బీచుపల్లి, ఈశ్వర్,హుస్సేన్,టోపి బాషా ,మహబూబ్ బాషా, తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటు వచ్చిన వారికి గోల్డెన్ అవర్ కీలకం

కర్నూలు(హాస్పిటల్): గుండెపోటు వచ్చిన రోగికి మొదటి గంట (గోల్డెన్ అవర్) చాలా కీలకమైనదని కిమ్స్ హాస్పిటల్ అత్యవసర విభాగాధిపతి డాక్టర్ వద్ది మురళీకృష్ణ చెప్పారు. గత నెల నుంచి మూడు దశలుగా కిమ్స్ హాస్పిటల్‌లో ఈ గోల్డెన్ అవర్‌పై అవగాహన సదస్సులు నిర్వహిస్తున్నారు. అమెరికన్ హార్ట్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బేసిక్ లైఫ్ సపోర్ట్ కార్యక్రమంపై అవగాహన కల్పిస్తున్నారు. ఈ సందర్భంగా బుధవారం నిర్వహించిన కార్యక్రమంలో డాక్టర్ మురళీకృష్ణ మాట్లాడుతూ గోల్డెన్ అవర్‌లో అత్యవసర మెళకువలు పాటించడానికి ఇలాంటి అవగాహన సదస్సులు ఎంతో ఉపయోగపడతాయని తెలిపారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వారిని ఆసుపత్రికి తరలించేలోపు కొన్ని చిన్న మెళకువల ద్వారా అత్యవసర స్థాయి ప్రథమ చికిత్స అందించి కాపాడవచ్చన్నారు.

నేడు జెడ్పీలో అల్లూరి జయంతి వేడుకలు

కర్నూలు(అర్బన్): జిల్లా పరిషత్ ఆవరణలో నేడు (గురువారం) మన్యం వీరుడు అల్లూరి సీతారామరాజు 127వ జయంతి కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు జెడ్పీ సీఈఓ జి నాసరరెడ్డి బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జెడ్పీ చైర్మన్ యర్రబోతుల పాపిరెడ్డి అధ్యక్షతన నిర్వహించనున్న ఈ కార్యక్రమానికి జిల్లా పరిషత్ ఉద్యోగులు, సిబ్బంది అందరు సకాలంలో హాజరు కావాలని ఆయన కోరారు.

బెస్ట్ అవైలబుల్ స్కీంను ప్రారంభించండి

కర్నూలు(అర్బన్): రాష్ట్ర వ్యాప్తంగా ఎంతో మంది ఎస్సీ, ఎస్టీ విద్యార్థుల ఉజ్వల భవితకు బాటలు వేసే బెస్ట్ అవైలబుల్ స్కూల్ స్కీంను పునరుద్ధరించాలని టీఎస్ఎఫ్ నేతలు కోరారు. బుధవారం అమరావతిలోని సచివాలయంలో గిరిజన సంక్షేమ శాఖ మంత్రి సంధ్యారాణిని టీఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు రాగిరి చంద్రప్ప కలిసి వినతి పత్రం అందించారు. ఈ పథకం అమల్లో ఉన్న సమయంలో వేలాది మంది విద్యార్థులకు ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లలో ఉచితంగా ప్రభుత్వం విద్యా , వసతిని కల్పించేదన్నారు. మంత్రిని కలిసిన వారిలో టీఎస్ఎఫ్ నేతలు అక్కులప్ప నాయక్, విష్ణునాయక్ తదితరులు ఉన్నారు.

కుల ధ్రువీకరణ పత్రాల జారీలో నిర్లక్ష్యం తగదు



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ పరిధిలోని సచివాలయాల్లో కులధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకునే వారికి ఇబ్బందులు లేకుండా త్వరితగతిన మంజూరు చేయాలని నగరపాలక కమిషనర్ భార్గవ్‌తేజ ఆదేశించారు. ఈ విషయంలో నిర్లక్ష్యం తగదని హెచ్చరించారు. బుధవారం స్థానిక నగరపాలక నూతన కౌన్సిల్ హాలులో వీఆర్‌ఓలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ నగర పరిధిలోని సచివాలయాల్లో 32,320 మందికులధ్రువీకరణ పత్రాల కోసం దరఖాస్తు చేసుకున్నారన్నారు. అయితే, ఇప్పటి వరకు 8,027 పత్రాల పరిశీలన మాత్రమే జరగడంపై కమిషనర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. ఈనెల 13లోపు అందరికీ కుల ధ్రువీకరణ పత్రాలు అందజేయాలని ఆదేశించారు. సమావేశంలో కర్నూలు అర్బన్ ఎంఆర్‌ఓ మోహన్ కుమార్ పాల్గొన్నారు.

బడి బస్సు భద్రతపై దృష్టి



వివిధ విద్యాసంస్థల బస్సు డ్రైవర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న సీఐ గౌతమి



బడి బస్సును తనిఖీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు

- నిబంధనలు పాటించకపోతే చర్యలు తప్పవు
- స్పెషల్ డ్రైవ్ నిర్వహించిన ట్రాఫిక్ పోలీసులు

కర్నూలు: బడి బస్సు భద్రంగా ఉంటే పిల్లల ప్రయాణం సురక్షితమవుతుంది. ఈ నేపథ్యంలో బడి బస్సుల భద్రత ఎలా ఉందనే దానిపై ట్రాఫిక్ పోలీసులు బుధవారం నగరంలో స్పెషల్ డ్రైవ్ నిర్వహించారు. సీఐ గౌతమి ఆధ్వర్యంలో ట్రాఫిక్ సిబ్బంది రెండు బృందాలుగా ఏర్పడి రాజ్‌విహార్, ఉడ్‌ల్యాండ్ సర్కిల్ వద్ద రెండు గంటల పాటు విద్యాసంస్థల బస్సులను తనిఖీ చేశారు. చాలామంది డ్రైవర్లు యూనిఫాం లేకుండానే బస్సులు నడుపుతుండటంతో అలాంటి వారిని సమావేశపరచి సీఐ గౌతమి కౌన్సెలింగ్ నిర్వహించారు. అలాగే కొత్త చట్టాల గురించి కూడా వారికి వివరిస్తూ నిబంధనలు పాటించకపోతే భారీగా జరిమానా చెల్లించక తప్పదని హెచ్చరించారు. బస్సుకు సంబంధించిన ఇన్సురెన్స్, పొల్యూషన్ సర్టిఫికెట్, డ్రైవర్‌కు సంబంధించి లైసెన్స్ అందుబాటులో ఉంచుకోవాలని సూచించారు. బస్సును వేగంగా నడిపినా, అజాగ్రత్తగా సెల్‌ఫోన్‌లో మాట్లాడుతూ వాహనాలు నడిపినా చర్యలు తప్పవని హెచ్చరించారు. బడి బస్సుల నిర్వాహకులు వాటికి సంబంధించిన పత్రాలు లేకుండా రోడ్డుపైకి తీసుకురాకూడదని హెచ్చరించారు. ఇందులో భాగంగా లైసెన్స్ లేకుండా నడుపుతున్న ద్విచక్ర, నాలుగు చక్రాల వాహనాలు, ఆటోలను కూడా తనిఖీ చేశారు. వాహనాలకు సంబంధించిన రికార్డులను పరిశీలించి మోటర్ వాహన చట్టం కింద చలానాలు విధించినట్లు సీఐ తెలిపారు.

ఆసుపత్రిలో పారిశుధ్యం మెరుగుపడాలి

- పెద్దాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ ప్రభాకర్‌రెడ్డి



ఆసుపత్రిలో పర్యటిస్తున్న సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి

కర్నూలు (హాస్పిటల్): పెద్దాసుపత్రిలో పారిశుధ్యం మెరుగుపడాలని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సి.ప్రభాకర్‌రెడ్డి ఆదేశించారు. బుధవారం ఆయన ఆసుపత్రిలోని ఫార్మసీ విభాగం, ఔషధ శాల, క్యాజువాలిటీ, ఓల్డ్ బ్లడ్ బ్యాంక్ తదితర విభాగాలను పరిశీలించారు. ఫార్మసీ విభాగంలో ఆన్‌లైన్ ప్రాసెస్‌పై ఆరా తీశారు. ఆన్‌లైన్ ఎంట్రీలో జరుగుతున్న విధానాన్ని పరిశీలించారు. ఈ-ఫార్మసీ ఆన్‌లైన్ ఎంట్రీ విధానం వంద శాతం పూర్తి చేయాలని, కర్నూలు ప్రభుత్వాసుపత్రిని ప్రథమ స్థానంలోకి తీసుకురావాలని ఫార్మసీ సిబ్బందికి దిశా నిర్దేశం చేశారు. అనంతరం ఔషధ శాల విభాగం వద్ద శానిటేషన్ పనులపై ఆరా తీశారు. మూడు రోజులైనా పారిశుధ్య పనులు ఓ కొలిక్కి రావడం లేదని అసహనం వ్యక్తం చేశారు. కాలువల్లో సీల్టు తీయాలని ఆదేశించారు. మెకానిక్ షెడ్డును పరిశీలించి అక్కడ ఉన్న ట్రాలీలను మరమ్మతులు చేయాలని చెప్పారు. శానిటేషన్ విభాగం స్టాక్ పాయింట్‌లో ఉన్న మెటీరియల్, సిబ్బంది గురించి ఆరా తీశారు. ఆయన వెంట ఆసుపత్రి ఏడీ రమేష్ బాబు, ఏఆర్ఎంఓ డాక్టర్ వెంకటరమణ, హాస్పిటల్ అడ్మినిస్ట్రేటర్ డాక్టర్ శివబాల నాగాంజన్, డాక్టర్ కిరణ్‌కుమార్, డాక్టర్ సునిల్ ప్రశాంత్, ఫార్మసీ మెడికల్ ఆఫీసర్ డాక్టర్ శారద తదితరులు పాల్గొన్నారు.

ప్రైవేట్, కార్పొరేట్ కాలేజీల్లో ఫీజులు నియంత్రించాలి



ఇంటర్మీడియెట్ బోర్డు కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న విద్యార్థి సంఘాల నాయకులు

కర్నూలు సిటీ: జిల్లాలోని ప్రైవేటు, కార్పొరేట్ విద్యా సంస్థల్లో ఫీజులను నియంత్రించాలని విద్యార్థి సంఘాల నాయకులు డిమాండ్ చేశారు. బుధవారం ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ కార్యాలయ అధికారి ఆఫీసు ఎదుట ధర్నా చేపట్టారు. ఇందులో పీడీఎస్‌యూ రాష్ట్ర కార్యదర్శి రాజేష్, డీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు శరత్‌కుమార్ పాల్గొని ప్రసంగించారు. ఇంటర్మీడియెట్ బోర్డు నిబంధనలను ఏ మాత్రం పాటించకుండానే కార్పొరేట్, సెమి కార్పొరేట్ కాలేజీల యాజమాన్యాలు నీట్, జేఈఈ, ఐఐటీల పేరుతో లక్షల్లో ఫీజులు వసూలు చేస్తున్నాయన్నారు. కమర్షియల్ కాంప్లెక్స్‌లు, అపార్టమెంట్లలో కాలేజీలు నిర్వహిస్తున్నాయని ఆరోపించారు. ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో చదువుతున్న విద్యార్థులకు సైతం ఐఐటీ, నీట్, జేఈఈ తరగతులు అదనంగా నిర్వహించాలని, ఖాళీగా ఉన్న అధ్యాపక పోస్టులను భర్తీ చేసేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. అనంతరం జిల్లా వృత్తి విద్యాధికారి వై.పరమేశ్వరరెడ్డికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాల నాయకులు రాజు, అఖిల్, శేఖర్, విజయ్, వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌ను కలిసిన జెడ్పీ చైర్మన్



కలెక్టర్ పి.రంజిత్‌బాషాకు బొకే అందజేస్తున్న జెడ్పీ చైర్మన్ పాపిరెడ్డి



జిల్లా కలెక్టర్‌ను సత్కరిస్తున్న జిల్లా వ్యవసాయ శాఖ అధికారులు, సంఘం ప్రతినిధులు

కర్నూలు(సెంట్రల్): జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి నూతన కలెక్టర్ పి.రంజిత్‌బాషాను కలిశారు. బుధవారం సాయంత్రం ఆయన కలెక్టర్‌ను క్యాంపు కార్యాలయంలో కలిసి పూలబొకే అందజేసి శాలువా కప్పి సత్కరించారు. అనంతరం జిల్లాలోని అభివృద్ధి పనులపై ఇద్దరు కాసేపు చర్చించుకున్నారు.

కర్నూలు(అగ్రికల్చర్): జిల్లా కలెక్టర్ రంజిత్‌బాషాను జిల్లా వ్యవసాయ అధికారులు, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం ప్రతినిధులు బుధవారం మర్యాద పూర్వకంగా కలిశారు. జిల్లా వ్యవసాయ అధికారి పీఎల్ వరలక్ష్మి దాదాపు 10 రోజులుగా సెలవుల్లో వెళ్లారు. తిరిగి బుధవారం జాయిన్ అయిన ఆమె జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం నేతలు, తన కార్యాలయ ఏఓలతో కలిసి కలెక్టర్‌ను ఆయన చాంబరులో కలిశారు. కార్యక్రమంలో డీపీవోతో పాటు కర్నూలు ఏడీఏ సాలురెడ్డి, జిల్లా వ్యవసాయ అధికారుల సంఘం అధ్యక్ష, కార్యదర్శులు విశ్వనాథ్, దస్తగిరిరెడ్డి, ఏఓలు రాఘవేంద్ర, అల్లీపీర, శారదమ్మ,అనురాధరెడ్డి,ఉషారాణి, వెంకటరంగారెడ్డి, కోడుమూరు,సీ.బెలగల్, గూడూరు ఏవోలు రవిప్రకాశ్, మల్లేష్ యాదవ్, శ్రీవర్దన్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

సాగునీటి పనుల పురోగతిపై నివేదికలు ఇవ్వండి

కర్నూలు (సిటీ): ఉమ్మడి జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులు, కాలువల్లో జరుగుతున్న పనుల పురోగతిపై నివేదికలు ఇవ్వాలని జలవనరుల శాఖ ముఖ్య ఇంజినీర్ కబీర్ బాషా ఆదేశించారు. బుధవారం ఆయన తన కార్యాలయంలో సర్కిల్ ఎస్ఈ, ఈఈ, డీఈలతో పనుల పురోగతిపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాలో సుమారు 12 పనులు జరుగుతున్నాయన్నారు. అవి ఏ స్టేజీలో ఉన్నాయి? ఆయా పనులు పూర్తి చేసేందుకు ఇంకా ఎంత సమయం పడుతుంది? అనే వివరాలతో కూడిన నివేదికలు గురువారం మధ్యాహ్నం లోపు ఇవ్వాలని సూచించారు.

రూ.19.4 కోట్లతో అంచనాలు

ఉమ్మడి జిల్లాలోని వివిధ సాగునీటి ప్రాజెక్టులు, కాల్వల్లో అత్యవసరమైన పనులు చేసేందుకు పని నిర్వహణ నిధి కింద 177 పనులు రూ.19.4 కోట్లతో అంచనాలు వేసినట్లు సీఈ సమావేశంలో వెల్లడించారు. ఈ పనులకు ఆమోదం వచ్చిన వెంటనే మొదలు పెట్టాలని, ప్రాజెక్టులకు, కాల్వలకు నీరు వచ్చేలోపు పనులు పూర్తి చేయాలన్నారు. పని నిర్వహణ కింద ముఖ్యంగా ప్రాజెక్టుల్లోని మెకానికల్ పనులకు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలన్నారు.

చిన్నారులందరికీ వ్యాక్సిన్ వేయాలి



చిన్నారికి వ్యాక్సిన్ వేస్తున్న డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్

కర్నూలు(హాస్పిటల్): అర్హులైన గర్భిణులు, చిన్నారులందరికీ క్రమం తప్పకుండా సమయానుసారం వ్యాక్సిన్లు వేయాలని డీఎంహెచ్‌ఓ డాక్టర్ వై. ప్రవీణ్‌కుమార్ ఆదేశించారు. బుధవారం నగర శివారులోని పెద్దపాడు సచివాలయంలో నిర్వహిస్తున్న వ్యాధినిరోధక టీకాల కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. గర్భిణులు, పిల్లలకు సంబంధించిన వ్యాక్సినేషన్ రికార్డులు, రిపోర్టులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎంఆర్ వన్, ఎంఆర్ టు వ్యాక్సిన్లు వంద శాతం పూర్తి చేయాలని, ఆ వివరాలను ఆర్‌సీహెచ్ పోర్టల్‌లో అప్‌లోడ్ చేయాలని చెప్పారు. ఏఎన్ఎం ఏపీ, హెల్త్ యాప్, ఎంసీపీ కార్డులో ప్రతి గర్భిణి వివరాలను అప్‌డేట్ చేయాలని, అర్హులైన తల్లులకు తాత్కాలిక కుటుంబ నియంత్రణ పద్ధతులపై అవగాహన కల్పించాలని ఆదేశించారు. ఈ నెల ఒకటి నుంచి ఆగస్టు 31వ తేదీ వరకు నిర్వహించే స్టాప్ డయేరియా కార్యక్రమంలో భాగంగా ప్రతి పీహెచ్‌సీ, యూపీహెచ్‌సీలు, విలేజ్ హెల్త్ క్లినిక్‌లు, అంగన్‌వాడీ కేంద్రాల్లో తప్పనిసరిగా ఓఆర్ఎస్, జింక్ మాత్రలను అందుబాటులో ఉంచుకుని, డయేరియా వ్యాధిపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యాధికారి డాక్టర్ నందిని, డీపీఎం ప్రసాద్ పాల్గొన్నారు.

విద్యా సంస్థల బంద్‌కు సహకరించండి



బంద్‌కు సహకరించాలని ఆర్‌యూ రెక్టార్‌కు వినతి పత్రం ఇస్తున్న విద్యార్థి సంఘాల నేతలు

కర్నూలు కల్చరల్: ఐక్య విద్యార్థి సంఘాల ఆధ్వర్యంలో గురువారం దేశ వ్యాప్తంగా విద్యా సంస్థల బంద్ చేపడుతున్నట్లు విద్యార్థి సంఘాల నాయకులు తెలిపారు. బుధవారం రాయలసీమ విశ్వవిద్యాలయం రెక్టార్ ఆచార్య ఎన్‌టీకే నాయక్‌ను కలిసి వినతి పత్రం అంజేసి బంద్‌కు సహకరించాలని కోరారు. అసమర్థ ఎన్‌టీఏను రద్దు చేయాలని, పీహెచ్‌డీ అడ్మిషన్లలో నెట్‌స్కోర్ విధానాన్ని వెనక్కి తీసుకోవాలని, విద్యార్థి సంఘాల నేతలపై అక్రమ కేసులు, నిర్బంధాలు, అణచి వేతలు, పాఠశాలల మూసివేతలు ఆపాలనే డిమాండ్లతో బంద్ చేస్తున్నట్లు విద్యార్థి సంఘాల నేతలు వెల్లడించారు. ఎస్ఎఫ్ఐ, ఏఐఎస్ఎఫ్, పీడీఎస్‌యూ, ఏఐఎస్‌యూ, ఎస్ఎస్‌యూఐ, పీడీఎస్ఓ నాయకులు వినతి పత్రం ఇచ్చిన వారిలో ఉన్నారు.

పరిశుభ్రతపై అవగాహన

కల్లూరు: పరిశుభ్రతపై విద్యార్థులకు అవగాహన కల్పించాలని ఎంఈఓ-1 శ్రీనివాసులు అన్నారు. బుధవారం కల్లూరు మండల విద్యాధికారి కార్యాలయం వద్ద డేటాల్ బనోగా స్వస్థ ఇండియా సార్ప్ సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయులకు పరిశుభ్రతపై ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. డీటీఎస్ఐ సంస్థ సభ్యులు చేతుల పరిశుభ్రతపై ఆరు రకాల విధానాలు తెలియజేశారు. ఈ సందర్భంగా ఎంఈఓ మాట్లాడుతూ..ఉపాధ్యాయులు విద్యార్థులకు వ్యక్తిగత శుభ్రత, పరిసరాల పరిశుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పించాలన్నారు. విద్యార్థులకు పాఠాలతో పాటు క్రమశిక్షణ, పరిశుభ్రత గురించి తెలియజేయాలని సూచించారు.

జిల్లాలో వలసల నివారణకు చర్యలు చేపట్టండి



కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన టీడీపీ బృందం

కర్నూలు : జిల్లాలోని పశ్చిమ ప్రాంతంలో వలసల నివారణకు చర్యలు తీసుకోవాలని టీడీపీ బృందం జిల్లా కలెక్టర్ రంజిత్ బాషాకు విన్నవించింది. జిల్లా నూతన కలెక్టర్‌గా బాధ్యతలు చేపట్టిన సందర్భంగా టీడీపీ కర్నూలు పార్లమెంట్ అధ్యక్షుడు పాలకుర్తి తిక్కారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సోమిశెట్టి వెంకటేశ్వర్లు, రాష్ట్ర కార్యదర్శి ఎర్రసాని నాగేశ్వరరావు యాదవ్ తదితరులు బుధవారం కలెక్టర్‌ను మర్యాదపూర్వకంగా కలసి పూలబొకే ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. అలాగే జిల్లాలో ప్రజలు ఎదుర్కొంటున్న సాగునీరు, తాగునీరు వంటి సమస్యల పరిష్కారం కోసం కూడా తక్షణ చర్యలు తీసుకోవాలని వినతిపత్రం సమర్పించారు. పశ్చిమ ప్రాంతానికి ప్రధానంగా తాగునీరు, సాగునీటి సమస్య ఉందని, జీవనోపాధి కోసం ప్రతి సంవత్సరం పొరుగు జిల్లాలు, రాష్ట్రాలకు వలస వెళ్తున్నారని, ఈ రెండు సమస్యలపై దృష్టి సారించి ఉపాధి అవకాశాలు కల్పించాలని వారు వినతిపత్రంలో కోరారు. టీడీపీ నాయకులు ఏవైఎస్ బాబు రాజు, టి.చిన్నమారెన్న, సత్రం రామకృష్ణుడు, ఎల్‌వీ ప్రసాద్ తదితరులు కలెక్టర్‌ను కలిసిన వారిలో ఉన్నారు.

అతిసారంపై అవగాహన పెంచాలి



వాల్‌పోస్టర్లు విడుదల చేస్తున్న ఆర్‌బీఎస్‌కే కో ఆర్డినేటర్ హేమలత

కర్నూలు(హాస్పిటల్): అతిసార వ్యాధి(నీళ్ల విరేచ నాలు) పట్ల ప్రజలకు అవగాహన పెంచాలని రాష్ట్రీయ బాలస్వాస్థ్య కార్యక్రమ సమన్వయ కర్త హేమలత చెప్పారు. బుధవారం ఆమె స్థానిక కుమ్మరిగేరిలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని సందర్శించారు. అనంతరం తల్లులకు అతిసార వ్యాధి నివారణపై అవగాహన కల్పించారు. వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని మూడేళ్ల నుంచి ఐదేళ్లలోపు చిన్నారుల పట్ల అప్రమత్తంగా ఉండాలని సూచించారు. భోజనానికి ముందు, మరుగుదొడ్డి ఉపయోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవాలని, పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని,మొదటి ఆరు నెలలు తప్పనిసరిగా బిడ్డకు తల్లిపాలు మాత్రమే తాగించాలని సూచించారు. పిల్లలకు తాజా వేడి ఆహారాన్ని తినిపించాలని చెప్పారు. ఎక్కడైనా అతిసార కేసులు నమోదైతే వెంటనే ఆరోగ్య కార్యకర్తలకు విషయం తెలపాలని అంగన్‌వాడీ టీచర్లకు సూచించారు. అనంతరం అతిసార నివారణకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆమె విడుదల చేశారు. కార్యక్రమంలో ఆరోగ్య కార్యకర్తలు పద్మావతి, సుజాత, అంగన్‌వాడీ టీచర్లు సావిత్రి, బాలాదుర్గమ్మ, సుబ్బలక్ష్మి, ఆశా కార్యకర్తలు కవిత, మద్దమ్మ, ప్రాజెక్షనిస్టు ఖలీల్ పాల్గొన్నారు.

కర్నూలు, బళ్లారి హైవే నిర్మించాలి



కేంద్ర మంత్రి గడ్కరీకి వినతిపత్రం అందజేస్తున్న ఎంపీ బస్తిపాటి నాగరాజు

కర్నూలు (సిటీ) : కర్నూలు- బళ్లారి హైవే నిర్మించాలని కర్నూలు ఎంపీ బస్తిపాటి నాగరాజు కేంద్ర మంత్రి గడ్కరీని కలిసి విన్నవించారు. పార్లమెంట్ సమావేశాల్లో పాల్గొనేందుకు ఢిల్లీకి వెళ్లిన ఎంపీ అక్కడ పలువురు కేంద్ర మంత్రులను కలుస్తూ జిల్లా అభివృద్ధికి సహకరించాలని కోరుతున్నారు. ఈ క్రమంలోనే బుధవారం రోడ్డు రవాణా శాఖ మంత్రి నితిన్ గడ్కరీని ఆయన కార్యాలయంలో కలిసి బళ్లారి హైవేతో పాటు కర్నూలు టోల్ గేట్ నుంచి పంచలింగాల గ్రామం వరకు సర్వీస్ రోడ్డు విస్తరణ చేపట్టాలని వినతిపత్రం సమర్పించారు. ఇందుకు కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించినట్లు ఎంపీ తెలిపారు.

వలంటీర్లపై కక్ష సాధింపు వీడాలి



సమావేశంలో మాట్లాడుతున్న ఐక్య వేదిక అధ్యక్షురాలు మీసాల సుమలత

కర్నూలు (టౌన్) : ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు వలంటీర్లను సేవకులుగా గుర్తించాలని ఎస్సీ,ఎస్టీ, బీసీ, మైనార్టీ మహిళా ఐక్య వేదిక అధ్యక్షురాలు మీసాల సుమలత కోరారు. ఏపీ మాజీ సీఎం జగన్‌పై ఉన్న కోపంతో వలంటీర్లపై కక్ష సాధింపు పద్ధతిని విడాలన్నారు. బుధవారం స్థానిక రోజా వీధిలో ఆ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత ఐదేళ్ల వలంటీర్లు ప్రభుత్వానికి, ప్రజలకు మధ్య వారధిగా ఉండి సేవలు అందించారన్నారు. వీరికి ఎన్నికల సమయంలో రూ. 10 వేల వేతనం ఇచ్చి 100 ఇళ్ల బాధతలు అప్పగిస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు చెప్పారన్నారు. ఈ కార్యక్రమంలో ఐక్య వేదిక నాయకులు దానేశ్వరీ, మీనాక్షి, పార్వతమ్మ, రాముడు,బోయమ నాగన్న, అంజనేయులు పాల్గొన్నారు.

కాలనీల్లో సమస్యలు పరిష్కరించండి

కర్నూలు (టౌన్): నగరంలోని సంతోష్‌నగర్, విష్ణు టౌన్ షిప్ మధ్యను ఉండే టీజీవీ కాలనీ,ఆంధ్ర బ్యాంకు కాలనీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని పట్టణ పౌర సంక్షేమ సంఘం, వార్డు అభివృద్ధి కమిటీ నాయకులు కోరారు. బుధవారం వారు ఆయా కాలనీల్లో పర్యటించి సమస్యలు పరిశీలించారు. రోడ్లు అధ్వానంగా ఉన్నాయని, చిన్నపాటి వర్షానికే చిత్తడిగా మారుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో కమిటీ నాయకులు రమేష్, గోపీనాథ్, రంగయ్య, లక్ష్మన్న వర్మ, క్రిష్ణ అన్వర్ బాషా, అశోక్ తదితరులు పాల్గొన్నారు.

నేడు 'విప్లవ జ్యోతి' పుస్తకావిష్కరణ

కర్నూలు కల్చరల్: ప్రముఖ కవి, కవి రాజహంస డాక్టర్ తొగట సురేష్‌బాబు రచించిన 'విప్ల వజ్యోతి' పుస్తకావిష్కరణ గురువారం సాయంత్రం 5 గంటలకు సీక్యాంప్ టీజీవీ కళాక్షేత్రంలో నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. తెలు గు వారి పౌరుష విక్రమ జ్వాల.. తెల్లదొరల గుండెల్లో బల్లెంలా నిలిచిన భరతమాత ముద్దుబిడ్డ మన్యం వీరుడు అల్లూరి సీతారామ రాజు జయంతిని పురస్కరించుకుని పుస్తకావిష్కరణ చేస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా కలెక్టర్ పి.రంజిత్ భాష ముఖ్య అతిథిగా హాజరై ఈ పుస్తకాన్ని ఆవిష్కరిస్తారని తెలిపారు.సాహిత్యాభిమానులు అందరూ పాల్గొనాలని సూచించారు.

పండ్ల తోటలతో సుస్థిర ఆదాయం



పండ్ల మొక్కలను పరిశీలిస్తున్న పీడీ అమర్‌నాథ్‌రెడ్డి

ఓర్వకల్లు: పండ్ల తోటల పెంపకంతో చిన్న, సన్నకారు రైతులకు సుస్థిర ఆదాయం లభిస్తుందని డ్వామా ప్రాజెక్టు డైరెక్టర్ అమర్‌నాథ్‌రెడ్డి తెలిపారు. క్షేత్రస్థాయి పర్యటనలో భాగంగా బుధవారం ఓర్వకల్లు మండలంలోని గుడుంబాయి తండాలో పర్యటించారు. బద్దిబాయి, తిరుపాలుబాయి అనే మహిళ రైతులు జాతీయ ఉపాధి హామీ పథకం కింద ఎకరాలో సాగు చేసిన మామిడి మొక్కలను పరిశీలించారు. ఈ సందర్భంగా పీడీ అమర్‌నాథ్‌రెడ్డి మాట్లాడుతూ.. రైతులు సాధారణ పంటల సాగుతో పాటు బోరు సదుపాయం ఉన్న వారు ఎకరా/రెండు ఎకరాల్లో పండ్ల తోటలను పెంచుకోవాలని సూచించారు. ఆసక్తి ఉన్న రైతులకు ప్రభుత్వమే మొక్కల ఖర్చు భరిస్తుందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి మండలంలో 500 ఎకరాల్లో పండ్ల మొక్కలను పెంచాలని లక్ష్యంగా పెట్టుకున్నట్లు చెప్పారు. ఇప్పటి వరకు 250 ఎకరాలను గుర్తించామని పేర్కొన్నారు. జాబ్‌కార్డు కలిగి 5 ఎకరాల్లోపు పొలం ఉన్న రైతులు జాతీయ ఉపాధి హామీ పథకంలో పండ్ల తోటల పెంపకం చేపట్టే విధంగా ప్రోత్సహించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం కాల్వ గ్రామం వద్ద చెక్‌డ్యామ్‌లో పూడికతీత పనులను పరిశీలించి, మస్టర్లను తనిఖీ చేశారు. ఆయన వెంట ఏపీఓ కుమార్‌సాయినాథ్, సాంకేతిక, క్షేత్రస్థాయి సహాయకులు ఉన్నారు.

వలంటీర్లకు రూ.10 వేల వేతనం ఇవ్వాలి



సమావేశంలో మాట్లాడుతున్న వై.నగేష్

కర్నూలు(సెంట్రల్): గ్రామ/వార్డు వలంటీర్లకు చంద్రబాబునాయుడు ఇచ్చిన హామీ మేరకు రూ.10 వేల వేతనం ఇవ్వాలని డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి వై.నగేష్ డిమాండ్ చేశారు. బుధవారం ఆ సంఘం కార్యాలయంలో మాట్లాడుతూ..అధికారంలోకి వస్తే వలంటీర్లను కొనసాగిస్తామని, జీతం రూ.10 వేలు చేస్తామని ముఖ్యమంత్రి ఎన్నికల ప్రచారంలో చెప్పారన్నారు. ఈ హామీని చంద్రబాబునాయుడు నిలబెట్టుకోవాలన్నారు. అలాగే వలంటీర్లను విధులకు దూరంగా ఉంచడం మంచిదికాదన్నారు. తొలగించిన వలంటీర్లను కూడా విధుల్లోకి తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాఘవేంద్ర, రంగప్ప, ప్రకాష్ పాల్గొన్నారు.